క్లుప్తంగా

పెనమలూరులో మూడు నామినేషన్‌లు దాఖలు



పెనమలూరు: పెనమలూరు నియోజకవర్గంలో ముగ్గురు అభ్యర్థులు సోమవారం ఎన్నికల రిటర్నింగ్ అధికారి జి.రాజుకు నామినేషన్‌లు అందజేశారు. స్వతంత్ర అభ్యర్థులుగా పచ్చిపాల కనకదుర్గారావు, గోగం రాము, బహుజన్ సమాజ్‌పార్టీ(బీఎస్పీ) నుంచి సోము మహేశ్వరరావు నామినేషన్‌లు తలా రెండు సెట్లు చొప్పున దాఖలు చేసినట్టు ఆర్‌ఓ రాజు తెలిపారు. ఇప్పటివరకు ఐదుగురు నామినేషన్లు వేశారు.

గన్నవరం నియోజకవర్గానికి రెండు నామినేషన్లు

గన్నవరం: గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గానికి సోమవారం ఇరువురు నామినేషన్లు దాఖలు చేశారు. జైభీమ్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా కలపర్తి భాస్కరరావు నామినేషన్ పత్రాలను ఆర్‌ఓ గీతాంజలి శర్మకు అందజేశారు. బీజేపీ రెబల్ అభ్యర్థిగా కొర్రపోలు శ్రీనివాసరావు నామినేషన్ సమర్పించారు. ఇప్పటి వరకు గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గానికి ఎనిమిది మంది నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.

జోగి నామినేషన్ ఆహ్వాన పత్రికల పంపిణీ



పెనమలూరు: పెనమలూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి జోగి రమేష్ ఈ నెల 24వ తేదీన నామినేషన్ వేస్తున్నందున ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరుతూ ఆహ్వాన పత్రికలను కానూరు సనత్‌నగర్‌లో సోమవారం పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి చాంద్‌బాషా ఆధ్వర్యంలో ప్రతి ఇంటికీ ఆహ్వాన పత్రికలు అందజేశారు. చాంద్‌బాషా మాట్లాడుతూ జోగి రమేష్ 24వ తేదీ ఉదయం 10 గంటలకు పెనమలూరులో నామినేషన్ వేస్తున్న సందర్భంగా ఈ కార్యక్రమాన్ని వేడుకగా నిర్వహిస్తున్నామన్నారు. అన్ని వర్గాల ప్రజలు తరలివచ్చి జోగిరమేష్‌కు మద్దతు పలికి ఆశీర్వదించాలని కోరారు.

వీఆర్ సిద్ధార్థలో ధరిత్రి దినోత్సవం

పెనమలూరు: ప్రపంచ ధరిత్రి దినోత్సవం సందర్భంగా వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కొల్లా నరేంద్ర మాట్లాడుతూ వాతావరణ కాలుష్యం కారణంగా భూతాపం నానాటికీ పెరిగి పోతోందన్నారు. పర్యావరణ పరిరక్షణ ఉంటేనే మానవాళికి, జీవరాసులకు మేలు జరుగుతుందన్నారు. ప్రతి నీటి బొట్టును ఒడిసి పట్టుకోవాలని, ప్లాస్టిక్ వాడకం నిషేధించాలని, భూమిని కాపాడుకోవాలని అన్నారు.

సొమ్ము విషయమై ఘర్షణ

పెనమలూరు: యనమలకుదురులో ఇద్దరు వ్యక్తుల మధ్య సొమ్ము విషయమై తలెత్తిన వివాదం ఘర్షణకు దారి తీయటంతో పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం యనమలకుదురుకు చెందిన జి.శ్రీనివాసరెడ్డి అదే గ్రామానికి చెందిన మైలా శ్రీనివాసరావు గతంలో కలిసి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేశారు. అయితే శ్రీనివాసరెడ్డి రూ.2.65 లక్షలు కారు కొనటానికి శ్రీనివాసరావుకు ఇచ్చాడు. వారి మధ్య విభేదాలు రావటంతో ఇరువురు విడిపోయారు. వీరిద్దరు యనమలకుదురు లాకుల వద్ద ఎదురుపడగా సొమ్ము విషయమై తగాదా పడి పరస్పరం దాడి చేసుకున్నారు. అందిన ఫిర్యాదుల మేరకు పోలీసులు ఇద్దరిపై కేసు నమోదు చేశారు.

వంశీకి మద్దతుగా నేతల ప్రచారం

గన్నవరం: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వల్లభనేని వంశీమోహన్‌కు మద్దతుగా గ్రామాల్లో ప్రచారం ఊపందుకుంది. మండలంలోని అల్లాపురంలో సర్పంచి డొక్కు సాంబశివవెంకన్నబాబు నేతృత్వంలో గడపగడపకు వైఎస్సార్‌సీపీ ప్రచారం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓట్లువేసి ఎంపీగా డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్ రావు, ఎమ్మెల్యేగా వంశీమోహన్‌ను గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఉపసర్పంచి అచ్చియ్య, పార్టీ నేతలు అవుటపల్లి శివప్రసాద్, ఆరేపల్లి నాగశంకర్, బలుసుపాటి సురేష్, చొప్పవరపు బాలశౌరి, బడుగు రాంబాబు పాల్గొన్నారు. స్థానిక రాయ్‌నగర్‌లో జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి, పార్టీ మహిళా నేతలు బత్తుల ఆశా రేఖ, సూరెడ్డి మణెమ్మ నేతృత్వంలో ఇంటింటికి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు పొనగంటి శివ, బూసిరెడ్డి, శిరీష, బర్మా శ్రీను పాల్గొన్నారు.

యార్లగడ్డ డ్రామాలు చెల్లవు

హనుమాన్‌జంక్షన్ రూరల్: వైఎస్సార్ సీపీ శ్రేణులను అయోమయానికి గురిచేయాలనే దురుద్దేశంతో టీడీపీ అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు చేస్తున్న డ్రామాలు చెల్లవని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి వెలగపల్లి ప్రదీప్ దుయ్యబట్టారు. స్థానిక విలేకరులతో ప్రదీప్ సోమవారం మాట్లాడుతూ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ పార్టీ సీనియర్ నేత డాక్టర్ దుట్టా రామచంద్రరావుకు ఏమాత్రం ముందస్తు సమాచారం లేకుండా యార్లగడ్డ వెంకట్రావు హడావుడిగా దుట్టా నివాసానికి వచ్చి కలిసి వెళ్లి సరికొత్త డ్రామాకు తెరలేపారన్నారు. డాక్టర్ దుట్టా అల్లుడు, వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ గోసుల శివభరత్‌రెడ్డి గత మూడు రోజులుగా వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వల్లభనేని వంశీకి మద్దతుగా ప్రచారంలో పాల్గొనటంతో ఓర్వలేక ఇలా చేశారన్నారు. డాక్టర్ దుట్టా కుటుంబం ఎప్పటికీ వైఎస్సార్ సీపీతోనే ఉంటుందని స్పష్టం చేశారు. యార్లగడ్డ దుష్ప్రచారాన్ని నమ్మవద్దని వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు.

పది ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల సత్తా

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచడానికి గత ఐదేళ్లుగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తీసుకున్న చర్యలు సత్ఫలితాలను ఇచ్చాయి. ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో ఈ విషయం ప్రస్ఫుటంగా గోచరించింది. నాడు-నేడు ద్వారా పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడం, పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టడం, వెనుక బడిన విద్యార్థులపై ప్రత్యేక పర్యవేక్షణ, ప్రత్యేక తరగతుల నిర్వహణ వంటి చర్యలు ఉత్తమ ఫలితాల సాధనకు దోహదపడ్డాయి.


మానస్ ఈశ్వర సాయి(573)


ఆకాష్ 568 మార్కులు


మాదు సింధూష 567 మార్కులు


సైరా బాను(584) బాపులపాడు జెడ్పీ


కసరెడ్డి గాయత్రి(572) నున్న జెడ్పీ


పల్లపోతుల యుగంధర్ 571 మార్కులు


ఎస్.వెంకటేష్ 567 మార్కులు


డి.శృతి(557) రామవరప్పాడు జెడ్పీ


వర్షిత (584) గన్నవరం మండలం టాపర్


ఎల్.గిరి పల్లవి (568) కంకిపాడు మండల ఫస్ట్


అందె వెన్నెల (563) కంకిపాడు మండల సెకండ్


సీహెచ్ సిద్ధార్థ (556) కోలవెన్ను జెడ్పీ విద్యార్థి

పెనమలూరు: పదవ తరగతి ఫలితాల్లో పెనమలూరు మండలంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సత్తా చాటారు. ఎంఈవో కనక మహాలక్ష్మి నుంచి సేకరించిన వివరాల ప్రకారం పెనమలూరు మండలంలోని ఆరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో మొత్తం 579 మంది విద్యార్థులు పది పరీక్ష రాయగా అందులో 446 మంది కృతార్థులయ్యారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పాస్ శాతం 77 శాతంగా నమోదయింది. తాడిగడప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన కోలా మానస్ ఈశ్వరసాయి 573 మార్కులతో మండలంలో మొదటి స్థానంలో నిలిచాడు. రెండవ స్థానంలో కానూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన జిడుగు ఆకాష్ 568 మార్కులు, మూడవ స్థానంలో పెనమలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన మాదు సింధూష 567 మార్కులు సాధించింది. పాఠశాలల ఉత్తీర్ణత శాతం వివరాల్లోకి వెళితే... పెనమలూరు పాఠశాలలో మొత్తం 232 మంది పరీక్ష రాయగా అందులో 185 మంది (80 శాతం) పాస్ అయ్యారు. పోరంకి పాఠశాలలో 87 మందికి గాను 65 మంది పాస్ (75శాతం) అయ్యారు. పాగోలు సుభాష్ 54 మార్కులతో పాఠశాల ఫస్టు వచ్చాడు. వణుకూరు పాఠశాలలో 27 మందికి గాను 21 మంది పాస్ (78 శాతం)అయ్యారు. హెప్సీబ 537 మార్కులు సాధించి పాఠశాల ఫస్టు వచ్చింది. కానూరు పాఠశాలలో 115 మందికి గాను 89 మంది (77 శాతం)పాస్ అయ్యారు. తాడిగడపలో 90 మందికి గాను 62 మంది(69 శాతం) పాస్ అయ్యారు. యనమలకుదురులో 28 మందికి 24 మంది((86 శాతం) పాస్ అయ్యారు. పి.రాకేష్ 534 మార్కులు సాధించి పాఠశాలలో ఫస్టు వచ్చాడు. యనమలకుదురులో కేవలం తెలుగు మీడియం మాత్రమే ఉండగా మండలంలోని తెలుగు మీడియంలో ఇక్కడ పాస్ శాతం ఎక్కువగా ఉంది. 500 మార్కులకు పైగా వచ్చిన విద్యార్థులు 47 మంది ఉండగా అందులో పెనమలూరు పాఠశాలకు చెందిన 25 మంది ఉండడం గమనార్హం.

హనుమాన్‌జంక్షన్ రూరల్: టెన్త్ పబ్లిక్ పరీక్ష ఫలితాల్లో బాపులపాడు మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు 81.34 శాతం ఉత్తీర్ణతను సాధించాయి. బాపులపాడు జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని షేక్ సైరాబాను 584 మార్కులతో మండలంలో ప్రథమస్థానంలో నిల్చింది. మండలంలోని 8 జెడ్పీ హైస్కూళ్లు, ఏపీఎం జూబ్లీ ఎయిడెడ్ పాఠశాలల నుంచి మొత్తం 461 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరు కాగా, 375 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. బాలికలు 87.09 శాతం, బాలురు 76.22 ఉత్తీర్ణతను సాధించారు. మండలం ఫస్ట్ సాధించిన బాపులపాడు జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని సైరా బానును ఎంఈవో శ్రీరామ్ బాలసింగ్, ఎంఈవో-2 సురేష్‌కుమార్, ప్రధానోపాధ్యాయుడు తోట వెంకట నాగేశ్వరరావు అభినందించారు. వీరవల్లి జెడ్పీ హైస్కూల్ విద్యార్థి ఎస్.దినేష్ చంద్ర 578 మార్కులతో మండలంలో ద్వితీయ స్థానాన్ని, మల్లవల్లి జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని సీహెచ్.ప్రియాంక 573 మార్కులతో మండలంలో తృతీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఏలూరురోడ్డులోని అప్పనవీడు జెడ్పీ హైస్కూల్‌లో 582 మార్కులతో పి.అఖిల పెదపాడు మండలం ఫస్ట్ సాధించింది. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తోట పుష్పావతి, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ మారుబోయిన కోటేశ్వరరావు ఆమెను అభినందించారు.

నున్న జెడ్పీ హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ

విజయవాడరూరల్: మండలంలో పదో తరగతి పరీక్షల్లో మొదటి మూడు స్థానాలు సాధించిన విద్యార్థులు నున్న జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులే కావడం విశేషం. ఈ పాఠశాలకు చెందిన కసరెడ్డి గాయత్రి 572 మార్కులు సాధించి మండలంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. పల్లపోతుల యుగంధర్ వెంకట దుర్గా ప్రసాద్ 571 మార్కులతో రెండవ స్థానం, సలాది మనోజ్ వెంకటేష్ 568 మార్కులు సాధించి మండలంలో మూడవ స్థానం సాధించారు. నున్న జిల్లా పరిషత్ హైస్కూల్ నుంచి మొత్తం 158 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా వారిలో 115 మంది విద్యార్థులు ఉత్తీర్ణులై 73 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు వజ్రాల భూపాల్‌రెడ్డి తెలియజేశారు. నున్న హైస్కూల్లో 19 మంది విద్యార్థులు 500 కు పైగా మార్కులు సాధించడం గమనార్హం. పాఠశాల చరిత్రలోనే ఇది ఒక రికార్డు. ఈ విజయంలో భాగస్వాములైన ఉపాధ్యాయ బృందానికి, అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుడు వి.భూపాల్‌రెడ్డి అభినందనలు తెలియజేశారు. విజయవాడ రూరల్ మండలంలో మొత్తం 870 మంది పరీక్షలు రాయగా 585 మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనట్టు మండల విద్యాశాఖాధికారి-2 ఎ.సూరిబాబు నాయక్ తెలియజేశారు.

కంకిపాడు మండలంలో 70.67 శాతం ఉత్తీర్ణత

కంకిపాడు: పదో తరగతి ఫలితాల్లో కంకిపాడు మండలం 70.67 శాతం ఉత్తీర్ణత సాధించింది. మండలంలోని వివిధ గ్రామాల్లో 10 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఈ విద్యాసంవత్సరం 508 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా, 359 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. తెన్నేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 87.50 శాతం ఉత్తీర్ణతతో మండలంలో ప్రథమ స్థానంలో నిలిచింది. 82.76 శాతం ఉత్తీర్ణతతో నెప్పల్లి జెడ్పీ పాఠశాల, 80 శాతం ఉత్తీర్ణతతో కోలవెన్ను జెడ్పీ పాఠశాల ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి.

మండల టాపర్ కోలవెన్ను విద్యార్థిని గిరిపల్లవి

పది ఫలితాల్లో కోలవెన్ను జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన ఎల్.గిరిపల్లవి 568 మార్కులు సాధించి మండలంలో ప్రథమస్థానాన్ని కైవసం చేసుకుంది. రెండో స్థానంలో కంకిపాడు జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన అందే వెన్నెల (563), మూడో స్థానంలో కోలవెన్ను జెడ్పీ పాఠశాలకు చెందిన సీహెచ్ సిద్ధార్థకుమార్ (556) నిలిచారు. ఉత్తమ ప్రతిభ చాటిన విద్యార్థులను, ఉత్తమ ఫలితాలకు కృషిచేసిన ఉపాధ్యాయులను ఎంఈఓ ప్రసాద్ ప్రత్యేకంగా అభినందించారు.

రామవరప్పాడులో...

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు, నిడమానూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులు సోమవారం విడుదలైన పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించారు. రామవరప్పాడు పాఠశాల నుంచి మొత్తం 206 మంది పరీక్షలకు హాజరవ్వగా 143 మంది పాసై 70 శాతం ఉత్తీర్ణత శాతం సాధించారు. పాఠశాల విద్యార్థి ఎస్.వెంకటేష్ 567 మార్కులు సాధించి పాఠశాలలో ప్రథమ స్థానం, డి.శృతి 557 మార్కులు సాధించి ద్వితీయ స్థానం, వి.లక్ష్మీనారాయణి 546 మార్కులతో తృతీయ స్థానం సాధించారు. ఈ సందర్భంగా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తాయారు, ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు.

నిడమానూరు జెడ్పీ పాఠశాలలో..

నిడమానూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మొత్తం 269 మంది పరీక్షలకు హాజరవ్వగా 175 మంది పాసై 65 శాతం ఉత్తీర్ణత సాధించారు. పాఠశాల విద్యార్థిని జాయ్ క్రిస్టినా 554 మార్కులతో స్కూల్ ఫస్ట్‌గా నిలిచింది. దేవిలోచన్ 552 మార్కులు సాధించి ద్వితీయ స్థానం సాధించాడు.

ఈ పాఠశాలలో 16 మంది విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించడం గమనార్హం. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం రమాదేవి విద్యార్థులను అభినందించారు.

గన్నవరంలో 76.44 శాతం ఉత్తీర్ణత

గన్నవరం: పదవ తరగతి ఫలితాల్లో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 76.44 శాతం ఉత్తీర్ణతను సాధించారు. మండలం నుంచి మొత్తం 658 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 503 మంది ఉత్తీర్ణులయ్యారు. వీరిలో 76 మంది వీరపనేనిగూడెం గురుకుల పాఠశాల విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణతను సాధించారు. గన్నవరం జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల 88.89 శాతం, వెదురుపావులూరు జెడ్పీ హైస్కూల్ 87.50 శాతం, వీరపనేనిగూడెం జెడ్పీ హైస్కూల్ 76.19, గొల్లనపల్లి జెడ్పీ హైస్కూల్ 76.06 శాతం, గన్నవరం జెడ్పీ బాలురోన్నత పాఠశాల 75.81 శాతం ఉత్తీర్ణతను సాధించినట్లు ఎంఈఓ కె.రవికుమార్ తెలిపారు. కేసరపల్లి జెడ్పీ హైస్కూల్ 58.73, దావాజిగూడెం జెడ్పీ హైస్కూల్ 58.62, సూరంపల్లి జెడ్పీ హైస్కూల్ 53.57 శాతం ఉత్తీర్ణులయ్యారని చెప్పారు. గన్నవరం జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని కె.వర్షిత 584 మార్కులతో మండలం టాపర్‌గా నిలవగా, అదే పాఠశాల విద్యార్థిని అబ్దుల్ సాదియా 583 మార్కులతో ద్వితీయ స్థానం, వీరపనేనిగూడెం గురుకుల పాఠశాల విద్యార్థిని ఎ.అరుణ 580 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచింది.

ప్రైవేట్ స్కూల్స్ 84.77 శాతం ఉత్తీర్ణత

మండలంలోని 13 ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు 84.77 శాతం ఉత్తీర్ణత సాధించారు. వీరిలో జోయల్ హర్ష 586 మార్కులు, దాకర్ల అకిల్ 584, శనగల ఉమామహేశ్వరరెడ్డి 584, కొసనాల రూపశ్రీ 582 మార్కులతో టాపర్లుగా నిలిచారు.

పది ఫలితాల్లో శ్రీవిశ్వశాంతి విజయదుందుభి

ఉయ్యూరు: పదో తరగతి ఫలితాల్లో ఉయ్యూరు శ్రీ విశ్వశాంతి విద్యార్థులు విజయ దుందుభి మోగించారు. 99 శాతం ఉత్తీర్ణత సాధించారు. అత్యధికంగా 587, 587, 586, 584, 584, 582, 580, 580 మార్కులను దక్కించుకున్నారు. 550కిపైగా 65 మంది విద్యార్థులు సాధించారు. ప్రతిభ చాటిన విద్యార్థులను శ్రీ విశ్వశాంతి విద్యా సంస్థల అధినేత మాదల సుబ్రహ్మణ్యేశ్వరరావు, డైరెక్టర్ మాదల సూర్యశేఖర్ అభినందించారు.

పది ఫలితాల్లో సత్తా చాటిన గోసాల హెచ్‌ఎంకే

కంకిపాడు: పదో తరగతి ఫలితాల్లో గోసాల హెచ్‌ఎంకే హైస్కూల్ నూరు శాతం ఉత్తీర్ణత సాధించింది. 78 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 78 మంది ఉత్తీర్ణులయ్యారు. 500కు పైగా మార్కులను 42 మంది విద్యార్థులు దక్కించుకున్నారు. పాఠశాల విద్యార్థిని జె.డాలి హర్షిత 588, బి.దివ్యతేజ 587, జి.జయ 582 మార్కులు సాధించినట్టు పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్.సుక్‌మీత్ కౌర్ తెలిపారు.

ఉయ్యూరులో 67 శాతం ఉత్తీర్ణత



ఉయ్యూరు: పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రతిభ చాటారు. ఉయ్యూరు మండలంలో 67 శాతం ఉత్తీర్ణత లభించింది. ఈ ఏడాది 224 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా, 151 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. 73 మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారు. ఉయ్యూరు జెడ్పీ పాఠశాలకు చెందిన తుమ్మల అఖిల (588/600) మార్కులతో మండలంలో ప్రథమస్థానాన్ని కైవసం చేసుకుంది. ఉత్తీర్ణత శాతంలో ఉయ్యూరు వీఆర్‌కేఎం 85 శాతంతో మొదటి స్థానంలో నిలవగా, కలవపాముల జెడ్పీ, ఆకునూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల 84 శాతంతో రెండో స్థానంలో నిలిచాయి.

ఉంగుటూరు మండల ఫస్ట్‌గా ప్రియతమ సాయి


ప్రియతమ సాయిని అభినందిస్తున్న హెచ్‌ఎం

ఉంగుటూరు: పదవ తరగతి ఫలితాలలో మండలంలోని తేలప్రోలులో డాక్టర్ భీమవరపు కృష్ణమోహన్‌రెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎస్.ప్రియతమ సాయి 557మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థానం సాధించాడు. ఈ సందర్భంగా సాయిని ఎంఈవో-1,2, రవికుమార్, సాంబశివరావు, హెచ్‌ఎం వేలూరి వెంకట ఆదిలక్ష్మి అభినందించారు. పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యుడు పంచకర్ల సత్యనారాయణ అభినందించి నగదు బహుమతితో సత్కరించారు.

వీరపనేనిగూడెం గురుకుల పాఠశాల నూరు శాతం ఉత్తీర్ణత


అరుణ(580) ప్రథమస్థానం


సాత్విక(576) ద్వితీయ స్థానం

గన్నవరంరూరల్: మండలంలోని వీరపనేనిగూడెం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థినులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించారు. 76మంది పరీక్షకు హాజరు కాగా మొత్తం అందరూ ఉత్తీర్ణులయ్యారు. వీరిలో ఎ.అరుణ 580 మార్కులు సాధించి ప్రథమస్థానం, 576 మార్కులు సాధించి డి.సాత్విక ద్వితీయ స్థానం సాధించారు. 20 మంది విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ వై.యశోద లక్ష్మి తెలిపారు. విద్యార్థులకు ఆమె, ఇతర ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు. వెదురుపావులూరు జెడ్పీహైస్కూల్‌లో 549 మార్కులు సాధించి ప్రజాపతి అనిల్ కుమార్, 536 మార్కులు సాధించి తాటికొండ కళ్యాణి ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. సూరంపల్లి జెడ్పీ హైస్కూల్‌లో షేక్ ఆఫ్రిన్ 501 మార్కులు, గొల్లనపల్లి జెడ్పీహైస్కూల్‌లో పులవర్తి బాలస్వామి 523 మార్కులు, వీరపనేని గూడెం జెడ్పీహైస్కూల్‌లో ఆవుల కళ్యాణి 556 మార్కులు సాధించి ఆయా పాఠశాలల స్థాయిలో ప్రథములుగా నిలిచారు. వారికి హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు.


జగనన్న గెలుపు చారిత్రక అవసరం


పెద్ద అవుటపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి వంశీమోహన్

వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ వల్లభనేని వంశీమోహన్

ఉంగుటూరు: రాష్ట్రానికి అన్నివిధాల మేలు జరగాలంటే మరోసారి జగనన్న ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ అన్నారు. ఉంగుటూరు మండలం పెద్ద అవుటపల్లిలో వంశీ పార్టీ శ్రేణులతో కలసి సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానికులు వారికి గజమాలలు, పుష్పాలతో ఘనస్వాగతం పలికారు. తొలుత తంబి పుణ్యక్షేత్రంలోని బ్రదర్ జోసఫ్ తంబి సమాధిని దర్శించుకుని ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా టీడీపీ మాజీ గ్రామ అధ్యక్షుడు మరీదు శ్రీధర్‌తో పాటు 50 కుటుంబాలు వంశీ, శివభరత్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి వంశీ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ గోసుల శివభరత్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి తోట వెంకయ్య, గన్నవరం, ఉంగుటూరు ఎంపీపీలు అనగాని రవి, వడ్లమూడి సరోజిని, గన్నవరం జెడ్పీటీసీ అన్నవరపు ఎలిజబెత్‌రాణి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వింత శంకర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఆదినారాయణరెడ్డి, గ్రామ కన్వీనర్ మాదు సాంబశివరావు, నాయకులు బాలస్వామి, భీమవరపు యతేంద్ర రామకృష్ణ, జోజి, ఎస్ఎస్ గౌడ్, శ్రీధర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

గన్నవరంలో యార్లగడ్డకు షాక్


బీజేపీ రెబల్ అభ్యర్థిగా నామినేషన్ సమర్పిస్తున్న కొర్రపోలు శ్రీనివాసరావు

గన్నవరం: నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావుకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. బీజేపీ నాయకుడు కొర్రపోలు శ్రీనివాసరావు రెబల్ అభ్యర్థిగా బరిలో నిలిచారు. ఈ మేరకు సోమవారం బీజేపీ నేతల తో కలిసి ఆయన తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జేసీ గీతాంజలిశర్మకు నామినేషన్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కొర్రపోలు మీడియాతో మాట్లాడుతూ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు బీజేపీలో ఒకరిద్దరు తప్ప మిగిలిన నేతలను కలుపుకొనిపోకుండా ఒంటెద్దు పోకడలకు పోతున్నారని చెప్పారు. నియోజకవర్గంలో బీజేపీకి రెండు వేలు ఓట్లు కూడా లేవని యార్లగడ్డ తమ పార్టీని కించపరుస్తూ మాట్లాడటం బాధాకరమన్నారు. అసలు ఎన్నికలు జరగకుండానే ఎమ్మెల్యే అయిపోయినట్లుగా యార్లగడ్డ భ్రమల్లో బతుకుతున్నారని ఎద్దేవా చేశారు. యార్లగడ్డ తన చుట్టూ అవినీతి పరులను పెట్టుకుని అవినీతిని అంతమొందిస్తానని ప్రగల్భాలు పలకడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అదృష్టం బాగుండి ఆనపర్తి బీజేపీ అభ్యర్థికి పార్టీ బీ-ఫామ్ వచ్చినట్లుగా తనకు కూడా రెండు మూడు రోజుల్లో వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ మేరకు బీజేపీ ముఖ్యనేత తనకు హామీ ఇచ్చినట్లు చెప్పారు. పార్టీ బీ-ఫామ్ ఇవ్వకపోయినా రెబల్‌గా పోటీ చేసి అత్యధిక ఓట్లు సాధించి బీజేపీ సత్తా ఏమిటో యార్లగడ్డకు తెలియజేస్తామని స్పష్టం చేశారు.

ఆకునూరులో జోగి ప్రచారానికి అనూహ్య స్పందన


ఆకునూరు బీసీ కాలనీలో ఇంటింటి ప్రచారం చేస్తున్న మంత్రి జోగి రమేష్

ఉయ్యూరు: మండలంలోని ఆకునూరు గ్రామంలో నిర్వహిస్తున్న ఇంటింటి ప్రచారానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. రాష్ట్ర గృహనిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లూ వేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వాన్ని బలపర్చాలని అభ్యర్థించారు. ప్రధాన రహదారితో పాటుగా గ్రామంలోని బీసీ కాలనీలో సోమవారం ప్రచారం సాగించారు. ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులతో కలిసి మంత్రి జోగి రమేష్ నిర్వహించిన ప్రచారానికి ప్రజలు అడుగడుగునా బ్రహ్మరథం పట్టారు. కార్యక్రమంలో దేవినేని స్మిత, దేవినేని గౌతమ్, ఉక్కు కాకాని మనవడు కాకాని విజయ్‌కుమార్, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గారపాటి నాని, నాయకులు మెరుగుమాల ఏసుబాబు, రమావత్ శ్రీకాంత్, శ్యాం, పండు, తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లకు అండగా ఉంటాం

పెనమలూరు: వలంటీర్లకు అండగా ఉంటామని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. చోడవరం గ్రామంలో సోమవారం పలువురు వలంటీర్‌లు తమ ఉద్యోగాలకు మూకుమ్మడి రాజీనామా చేసి గంగూరులోని మంత్రి కార్యాలయంలో మంత్రి జోగి రమేష్‌ను కలిశారు. ఈ సందర్భంగా మంత్రి రమేష్ మాట్లాడుతూ సమాజంలో పేదలు, వృద్ధులకు సేవలు అందించటానికి జగనన్న వలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేశారన్నారు. గత ఐదేళ్లలో వలంటీర్లు ప్రజలకు అందించిన సేవలు వెలకట్టలేనివని అన్నారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ వలంటీర్లపై అక్కసుతో లేనిపోని ఆరోపణలు చేసి వారి మనోభావాలను దెబ్బతీశారని విమర్శించారు. కార్యక్రమంలో చోడవరం సర్పంచి కాకర్ల వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

యనమలకుదురులో..

యనమలకుదురు సచివాలయం 3 పరిధిలో ఉద్యోగాలు చేస్తున్న వలంటీర్లు 12 మంది రాష్ట్ర బీసీ సంఘ కార్యదర్శి కోసూరి నరేష్‌కుమార్ ఆధ్వర్యంలో రాజీనామా చేశారు. వలంటీర్లు మాట్లాడుతూ తాము జగనన్నను గెలిపించుకుంటామని తెలిపారు.

జగన్ పాలనలో పేదల కుటుంబాల్లో వెలుగులు

పెనమలూరు: జగన్ పాలనలో పేదల కుటుంబాల్లో వెలుగు నిండిందని కానూరు మాజీ సర్పంచి, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు దేవభక్తుని సుబ్బారావు అన్నారు. ఆయన సోమవారం కానూరులో ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న అధికారంలోకి వచ్చిన తరువాత నవరత్నాలతో అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి పేదలను ఆదుకున్నారన్నారు. ఈ ఎన్నికల్లో కూడా జగన్‌ను గెలిపిస్తే పేదలు వచ్చే ఐదేళ్ల పాటు ఆనందంగా జీవించగలుగుతారన్నారు. కార్యక్రమంలో ఎండి.అన్వర్, హుస్సేన్, రహీం, మతిన్, నాసిర్, ఆలీ, రబ్బాని, గుల్జార్ పాల్గొన్నారు.